## కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నవాబుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అందిస్తూ, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సత్యమ్మ, లక్ష్మమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ సద్భావన టౌన్‌షిప్‌లో వివరాలు తెలుసుకుంటున్న లబ్ధిదారులు

## 69 ఫ్లాట్లకు డ్రా

**పోచారం రాజీవ్ సద్భావన టౌన్‌షిప్‌లో ఇళ్ల కేటాయింపు**

ఘట్‌కేసర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారం రాజీవ్ స్వగృహ సద్భావన టౌన్‌షిప్‌లో శనివారం సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్లకు డ్రా తీశారు. లబ్ధిదారులకు ఫ్లాట్లను కేటాయించారు. పోచారం సద్భావన టౌన్‌షిప్‌లో 240 సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్లుండగా, ఇందులో 69 ఫ్లాట్లను డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయించారు. ఇంకా 171 ఫ్లాట్లు ఉన్నాయి. దీంతోపాటు రెండు ట్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్లకు సైతం డ్రా తీశారు. రెండు ట్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్లకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఒక ఫ్లాటుకు 69 దరఖాస్తులు రాగా మరో ఫ్లాటుకు 19 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్‌కు రూ.13 లక్షలు నిర్ణయించారు. శుక్రవారం డ్రాతో ప్రభుత్వానికి దాదాపు రూ.9 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో అధికారులు భాస్కర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రజని, అప్పలరాజు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌ది జనహిత **పాదయాత్ర**
సీఎం సీటు పోవడం ఖాయం
బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ 7

రోడ్డు ప్రమాదంలో 8
**దంపతుల మృతి**
సుల్తాన్‌పూర్ గేట్ వద్ద ఘటన


ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్వీస్ రిజిస్టర్లు, సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు



## పదోన్నతుల పండగ!

**ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులకు ప్రమోషన్స్**

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న గెజిటెడ్ హెడ్‌మాస్టర్, స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులను సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 2వ తేదీన ప్రారంభమైన పదోన్నతుల ప్రక్రియ 11వ తేదీతో ముగియనుంది. జూలై 31వ తేదీ వరకు ఖాళీగా ఉన్న పోస్టులను పరిగణనలోకి తీసుకుని పదోన్నతుల జాబితాలో సీనియర్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించనున్నారు.

- మొత్తం ఎనబై జీహెచ్‌ఎం ఖాళీలు
- వికారాబాద్‌లో 31, మేడ్చల్‌లో 25, రంగారెడ్డిలో 24 వేకెన్సీలు
- స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పదోన్నతులకు పూర్తయిన సర్టిఫికెట్ల పరిశీలన



డీఈవో కార్యాలయంలో సర్వీస్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గెజిటెడ్ హెచ్‌ఎంల పదోన్నతుల కోసం జూలై మొదటి వారంలో కేటగిరీల వారీగా స్థానిక సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేసే సీనియర్ స్కూల్ అసిస్టెంట్ల సర్వీస్ రిజిష్టర్లు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. అయితే ఎస్జీటీ ఉపాధ్యాయులకు కొత్త గుబులు పట్టుకుంది. ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టుల్లో పదోన్నతులు పొందే అవకాశం తమకు వస్తుందా..? రాదా..? అనే ఉత్కంఠలో వారు ఉన్నారు. జీహెచ్‌ఎం పోస్టుల పదోన్నతుల ప్రక్రియ ముగిసిన తర్వాత స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టుల ఖాళీల సంఖ్యపై స్పష్టత రానుంది. వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 28 పీజీ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందిరానగర్(ఉర్దూ), పాత తాండూరు, మల్‌రెడ్డిపల్లి, హకీంపేట, కుదురుమళ్ల, కొంశెట్‌పల్లి, పట్లూర్, దిర్సంపల్లి, దోమ, బాలంపేట్, మిట్టకోడూర్, అంగడి చిట్టంపల్లి, చెన్‌గోముల్, కరణ్ కోట్, జిన్‌గుర్తి, ధారూరు, వికారాబాద్, మద్గుల్ చిట్టంపల్లి, శివారెడ్డిపేట్, తొరమామిడి(ఉర్దూ),

మిగతా 7వ పేజీలో...




విక్రయానికి సిద్ధంగా కుసుమ నూనె

## కల్తీ లేని కర్త గోల్డ్

**తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కుసుమ నూనె తయారీ**



- హైదరాబాద్ వ్యవసాయ యూనివర్సిటీలో విక్రయాలు
- విదేశాల్లోనూ క్రేజ్..
- డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి
- ఆసక్తి చూపుతున్న ప్రజలు
- జిల్లాలో ఆరు వేల ఎకరాల్లో కుసుమ సాగు

Sunday Special

తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఎలాంటి రసాయనాలు, కల్తీ లేకుండా కుసుమ నూనెను తయారు చేసి విక్రయిస్తున్నారు. తాండూరుతోపాటు తెలంగాణలోని అన్ని ప్రాంతాలు, విదేశాల్లోనూ ఈ నూనెకు ఇమేజ్ ఉంది. హైదరాబాద్ వ్యవసాయ యూనివర్సిటీలో ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. కుసుమ నూనెలో కొవ్వును కరిగించే తత్వం ఉంది. ఆవు నెయ్యితో సమానంగా భావించే ఈ నూనెకు 'కర్త గోల్డ్'గా నామకరణం చేసి వ్యవసాయ యూనివర్సిటీ బ్రాండ్‌గా మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

తాండూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో కుసుమ పంటను రైతులు అధికంగా పండిస్తారు. తాండూరులో కుసుమ సాగు విస్తీర్ణాన్ని పెంచి తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కుసుమ నూనె తయారీకి గానుగను ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేల ఎకరాల్లో కుసుమ సాగవుతోంది. తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కుసుమ నూనెను తయారు చేసి లీటర్‌కు రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ కుసుమ నూనెను హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో అమ్ముతున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల ప్రజలు తాండూరు కుసుమ నూనెను కొనుగోలు చేసేందుకు ఆసక్తి

మిగతా 7వ పేజీలో...

## ఆలయాభివృద్ధికి నివేదిక అందిస్తాం

**దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్**

దౌల్తాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అన్నారు. శనివారం దేవాలయ కమిషనర్ వెంకట్రావ్, కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని సందర్శించారు. గ్రామస్తులు ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ఆలయ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. సమీపంలో ఉన్న చెరువులో బోటింగ్‌తోపాటు పార్కు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బోడి వెంకట్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో వేంకటేశ్వర ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్

## పీఎం కిసాన్.. వీడియో కాన్ఫరెన్స్

**పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, శాస్త్రవేత్తలు**

పూడూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ నిధుల విడుదలపై ప్రధాని మోదీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను శనివారం మండలంలోని కంకల్ రైతు వేదికలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ నిర్మల, డాక్టర్ పంకజ్, సహాయ సంచాలకులు లక్ష్మీ కుమారి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం పెద్దఉమ్మెంతల్‌లో పత్తి, పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేన్లలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, శాస్త్రవేత్తలు

## మందులు అందుబాటులో ఉండాలి



మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేందర్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న డీఎంహెచ్‌వో లలిత

వికారాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్‌కుమార్ అన్నారు. సీజనల్ వ్యాధుల జిల్లా పర్యవేక్షక అధికారిగా ప్రభుత్వం నరేందర్‌కుమార్‌ను నియమించింది. శనివారం ఆయన రామయ్యగూడ పీహెచ్‌సీని పరిశీలించి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ, మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, మెడికల్ అధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తింసాన్‌పల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

**పాఠశాల అభివృద్ధికి**

## సహకరించాలి

పెద్దేముల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి కోరారు. మండలంలోని తింసన్‌పల్లి పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. ఈ విషయంపై కొద్ది రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు గ్రామస్తులను సంప్రదించారు. మధ్యాహ్న భోజనం వండేందుకు ముందుకు రావాలని కోరారు. అయితే పాఠశాలలో 12 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రోజు కూలి వదులుకుని వంట చేయడానికి వస్తే గిట్టుబాటు కాదని ఎవరూ ముందుకు రాలేదు. దీనిపై కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాగైనా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని ఆదేశించడంతో ఎంఈవో నర్సింగ్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పక్రుజామ గ్రామస్తులతో మాట్లాడి భోజనం వండేందుకు ఒప్పించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. శనివారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేసే ఫొటోలను రోజూ తనకు పంపించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్, ఎంఈవో నర్సింగ్‌రావు ఉన్నారు.

## పింఛన్లు పెంచకపోతే ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కొడంగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పెంచకపోతే ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. కొడంగల్ పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సన్నాహక సభకు హాజరై మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 13న ఎల్బీ స్టేడియంలో నిర్వహించే మహాగర్జనలోపు పింఛన్ల పెంపుదల చేయకపోతే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ఒత్తిడి తీసుకురావడంలో ప్రతిపక్ష పార్టీలు విఫలం చెందాయన్నారు. ఈ నెల 13న పింఛన్లు పెంచాలనే నినాదంతో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మహాగర్జనను చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు, నాయకులు అందె బాబు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు నరేంద్ర, నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి అంజి, అంబేడ్కర్ ప్రజా సంఘాలు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు రమేశ్‌బాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో అందరికీ సంక్షేమం

- అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



బంట్వారంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

బంట్వారం/మర్పల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు రేషన్ ప్రొసీడింగ్స్ అందజేశారు. అంతనం మాట్లాడుతూ గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికీ కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.600 కోట్లతో రోడ్లను బాగు చేయిస్తున్నట్లు తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.90 కోట్లు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, నర్సింహులు, సుధాకర్‌గౌడ్, శివ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్, నర్సింహారెడ్డి, నర్సింహులు, రమేష్ పాల్గొన్నారు.

### మర్పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన మర్పల్లి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మర్పల్లి మార్కెట్ యార్డులో శనివారం లబ్ధిదారులకు రేషన్ కార్డు ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో వేసిన సీసీ రోడ్లకు సంబంధించి బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్‌యాదవ్ స్పీకర్‌ను కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో జయరాం, కృష్ణారెడ్డి, రాములుయాదవ్, కలిమోద్దీన్ పాల్గొన్నారు.

## నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**



తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్

పరిగి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పరిగి తహసీల్దార్ కార్యాలయ ప్రత్యామ్నాయ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. పాత తహసీల్దార్ కార్యాలయం స్థానంలో కొత్త భవనం నిర్మించనున్న నేపథ్యంలో కార్యాలయాన్ని ప్రత్యామ్నాయ భవనంలోకి మార్చేందుకు నిర్మిస్తున్న పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. భనవ నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేసి అందులోకి తెస్తే కార్యాలయాన్ని మారుస్తామని తెలిపారు. ఆయనవెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి, కమిషనర్ వెంకటయ్య ఉన్నారు.

### నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటాం

ఓ రేకుల షెడ్డులో తలదాచుకుంటున్న నారాయణ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. వృద్ధుడు నారాయణ, మనుమళ్లు అంజనేయులు(మూగ), నర్సింహులు గురించి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ పరిగిలో ఉంటున్న నారాయణ వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. నారాయణ కొడుకు వెంకటేశ్, కోడలు పద్మమ్మ. వీరి కొడుకులు నర్సింహులు, అంజనేయులు.. తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలు తాత నారాయణ దగ్గర ఉంటున్నారు. వారి ఇబ్బందులను తెలుసుకున్న కలెక్టర్ రూ.10 వేల ఆర్థికసాయం చేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే

ఆమనగల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన భట్టిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సోమశిలలో డిప్యూటీ సీఎంతో కలిసి బోటులో ప్రయాణించారు. కల్వకుర్తి నియోకవర్గ అభివృద్ధిపై భట్టి దృష్టికి తీసుకుపోయారు. అభివృద్ధి పనులకు నిధుల కోసం కోరగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.



భట్టి విక్రమార్కతో బోటులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

# దివ్యాంగులకిచ్చిన హామీ అమలు చేయాలి




మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

చేవెళ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):ఎన్నికలప్పుడు దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6వేల పెన్షన్ ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శనివారం చేవెళ్లలోని వేంకటేశ్వర గార్డెన్‌లో చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల వికలాంగులు, పెన్షన్‌దారుల మహాగర్జన సన్నాహక సమావేశానికి మంద కృష్ణ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ... 18ఏళ్లుగా దివ్యాంగుల హక్కుల కోసం, పెన్షన్ పెంపు కోసం ఎమ్మార్పీఎస్ పనిచేస్తోందన్నారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్.. అధికారం చేపట్టి 20 నెలలు గడుస్తున్నా పింఛన్ పెంచకపోవడం బాధాకరం అన్నారు. ఏపీలో దివ్యాంగుల పెన్షన్ పెంచారని, తెలంగాణలో మాత్రం పెంచలేదన్నారు. దివ్యాంగుల పెన్షన్ పెంపు గురించి ప్రతిపక్షనేత కేసీఆర్ ప్రభుత్వాన్ని అడగడు.. సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేయడు అని అన్నారు. ధనిక కుటుంబాల్లో పుట్టిన వీరిద్దరికి పేదలు, దివ్యాంగుల కష్టాలు ఎలా తెలుస్తాయన్నారు. రాష్ట్రంలో 50లక్షల మంది పెన్షన్లపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. పెన్షన్ పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలుచేస్తారో? లేదా రాజీనామా చేస్తారో తేల్చుకుందామన్నారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జన సభకు దివ్యాంగులు, పెన్షన్‌దారులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఉపేందర్, రాష్ట్ర నాయకులు మాసాయిపేట యాదగిరి, ప్రవీణ్‌కుమార్, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

# నిరక్షరాస్యత వల్లే బాల్య వివాహాలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

నందిగామ, అగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత వల్లే సమాజంలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, చదువుతోనే సమాజం వికసిస్తుందని షాద్‌నగర్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. శనివారం నందిగామలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సీనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న ఆధునిక సమాజంలో విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలపై, బాల్య వివాహాలపై విద్యార్థులు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరిపితే కఠిన శిక్షలు ఉంటాయని, బాల్యంలో వివాహం చేసుకుంటే పుట్టబోయే పిల్లలు అనారోగ్యంతో ఉంటారని తెలిపారు. బాలికలను ఎవరైనా వేధిస్తే 100 డయల్‌తో పాటు లీగల్ సెల్ అథారిటీ టోల్ ఫ్రీ నంబర్ 15100కు కాల్ చేయాలన్నారు. చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న విషయాలను గమనించాలని సూచించారు. చదువు ఒక బ్రహ్మాస్త్రం అని, రక్షణ బాటలో మేముంటామని.. బంగారు బాటలో మీరుండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌యాదవ్, న్యాయవాదులు రహీముద్దీన్, నర్సింలు, మనోహర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చిక్కడు.. దొరకడు!

- లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులను చూసి పరారైన పంచాయతీ కార్యదర్శి
- సవాలుగా మారిన అతడి అరెస్టు



సురేందర్

షాద్‌నగర్/కొత్తూర్,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేందర్ అరెస్టు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి సవాలుగా మారింది. ఓ వ్యాపారి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ రాకను గమనించి జూలై 25న పరారైన సురేందర్.. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు పత్తా లేకుండా పోయాడు. కుటుంబంతో సహా ఆచూకీ లేకుండా పోయిన సురేందర్‌ను పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు వారం రోజులుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇన్ముల్‌నర్వలోని ఓ ఇంటి నిర్మాణానికి ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకునేందుకు సురేందర్.. ఓ వ్యాపారిని రూ.లక్ష లంచం అడిగాడు. అడ్వాన్సుగా రూ.50వేలు, పని పూర్తయ్యాక మిగిలిన డబ్బు చెల్లించాలని ఒప్పందం చేసుకున్నాడు. దీంతో వ్యాపారి దీనిపై ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఏసీబీ సూచన మేరకు ఆ వ్యాపారి రూ.50 వేలిస్తానని సురేందర్‌ను జూలై 25న శంషాబాద్ సమీపంలోని ఇండియానా హోటల్ వద్దకి పిలిచాడు. వ్యాపారి నుంచి రూ.50వేలు తీసుకున్న సురేందర్ ఏసీబీ అధికారుల రాకను గమనించి తన కారులో పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు వెంబడించినా ఫలితం లేకపోయింది. జూలై 26న సురేందర్ ఇంటికి వెళ్లిన ఏసీబీ అధికారులు అతడి కారు, రూ.50 వేల నగదును సీజ్ చేశారు. నాటి నుంచి సురేందర్ జాడ లేకపోగా, అతడిని అదుపులోకి తీసుకోవాలని ఏసీబీ అధికారులు గాలిస్తున్నారు. సురేందర్, తన కుటుంబ సభ్యులతో కలిసి రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. ఆయా ప్రాంతాలకు వెళ్లేసరికి అక్కడి నుంచి పరారవుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. మరోపక్క, ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన సురేందర్.. ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

# బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తోడ్పాటు

కడ్తాల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికి మేలు జరుగుతుందని చెప్పారు. కడ్తాల మండలంలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రావిచెడ్‌లో అనారోగ్యంతో మృతిచెందిన కృష్ణయ్యగౌడ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రూ.5వేలు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి రూ.6వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు శ్రీనివాస్, జనార్ధన్‌గౌడ్, పారేశ, రమేశ్‌గౌడ్, రూపేందర్, రాంచందర్, రాజు, యాదయ్య, ప్రభాకర్, శరమంద ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కీసర, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కీసరకు చెందిన గుర్రం లక్ష్మారెడ్డికి శనివారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. గుండె సమస్యతో చికిత్స పొందిన లక్ష్మారెడ్డి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వైద్య ఖర్చులకు 1.3లక్షలు మంజూరు కాగా, వజ్రేశ్ తన నివాసంలో చెక్కును అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డికి చెక్కును అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

## కల్తీ లేని కర్త గోల్డ్


కుసుమ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

(ఐదో పేజీ తరువాయి)

చూపుతున్నారు. ప్రతి నెలలో తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో డిమాండ్ బట్టి 500లీటర్ల నుంచి వెయ్యి లీటర్ల వరకు కుసుమ నూనె తయారు చేస్తున్నారు. పరిశోధన కేంద్రంలో గత అక్టోబర్‌లో కుసుమ పండించి గానుగాడించి నూనెను తయారు చేస్తున్నారు. కుసుమ నూనెలో గుండె జబ్బుల నివారణ, కొవ్వును కరిగించే తత్వం ఉంది.

**కుసుమ నూనెతో ప్రయోజనాలు మెండు**

విటమిన్ 'ఈ' అధికంగా ఉండే కుసుమ నూనెతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ చెప్పారు. పూర్వం కుసుమ నూనెను శిశువులకు మర్ద నకు, వృద్ధుల మోకాళ్ల నొప్పులకు వాడేవారు. ఇక్కడి కుసుమ నూనెకు అమెరికాలోనూ డిమాండ్ ఉంది. గానుగాడించిన ఈ నూనెను వివిధ రకాల ముందుల తయారీకి వాడుతున్నట్లు పేర్కొన్నారు. క్వింటాలు కుసుమలకు 20కిలోల నూనె వస్తుందని గానుగ నిర్వాహకులు చెబుతున్నారు.

## పదోన్నతుల పండగ!

(ఐదో పేజీ తరువాయి)

కొత్తపల్లి, చౌడాపూర్, ఇప్పాయిపల్లి, పుట్టపహాడ్, ఎక్‌మామిడి, చీమల్‌దరి, మొరంగపల్లి, కొడంగల్, దేవనూర్, యాలాల్, మైల్వార్‌లో ఖాళీలు ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో అల్వాల్-2, బహదూర్‌పల్లి, దూలపల్లి, అన్నోజిగూడ, కాప్రా, కుషాయిగూడ, బోగారం, కీసర, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, నేరేడ్‌మెట్, గుండ్లపోచంపల్లి, గురుమూర్తినగర్, జీడిమెట్ల, సూరారం, పొన్నాల్, తూంకుంట, తుర్కపల్లి, మల్లాపూర్, కొత్తపేట, ఉద్దెమర్రి, ఆర్టీ రామంతాపూర్ పాఠశాలల్లో పీజీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలోని పెద్ద అంబర్‌పేట్, కుంట్లూర్, బడంగ్‌పేట్, మొగిలిగిద్ద,నార్సింగి, ఇబ్రహీంపట్నం(ఉర్దూమీడియం-బాలికలు),శేరిగూడ, ఆకుల మైలారం, పెంజర్ల, ఆరుట్ల, అజీజ్‌నగర్, బాకారం, హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, కనకమామిడి, చందానగర్, నర్సప్పగూడ, శివరాంపల్లి, శేరిలింగంపల్లి, మహరాజ్‌పేట్, పొద్దటూర్, మహాలింగపురం,శంకర్‌పల్లి, తలకొండపల్లి, చుక్కాపూర్ హైస్కూళ్లలో పీజీహెచ్‌ఎం పోస్టులు వేకెన్సీ ఉన్నాయి.

**స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి**

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు సీనియర్ ఎస్జీటీల సర్వీస్ రిజిష్టర్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లను శనివారం పరిశీలించారు. జనరల్ విభాగంలో 2006 డీఎస్సీ వరకు నియామకమైన ఎస్జీటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. ఎస్సీ విభాగంలో 2012, ఎస్టీ విభాగంలో 2017, పీహెచ్‌సీ విభాగంలో 2017 డీఎస్సీ ఎస్జీటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్, ఫిజికల్ సైన్స్) పదోన్నతులకు వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగగా, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, హిందీ, తెలుగు, ఉర్దూ, స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రమోషన్లకు బాలికల ఉన్నత పాఠశాలలో పరిశీలన చేశారు. ఎస్‌ఏ మ్యాథ్స్, పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు జడ్పీ పాఠశాలలో, ఎస్‌ఏ సోషల్, ఫిజికల్ ఎడ్యుకేషన్(ఫిజికల్ డైరెక్టర్) పోస్టులకు జెడ్పీ బాలికల పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది.

**ఖాళీల్లో 70శాతం పదోన్నతులతోనే భర్తీ...**

వికారాబాద్ జిల్లాలో అన్ని కేడర్లలో కలిపి 428 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో 31 పీజీ హెచ్‌ఎం పోస్టులు, 125 స్కూల్ అసిస్టెంట్, తత్సమాన హోదా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. వేకెన్సీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70:30 నిష్పత్తితో భర్తీ చేస్తారు. ఖాళీల్లో 70శాతం పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయనుండగా, 30 శాతం పోస్టులను డీఎస్సీ నిర్వహించి భర్తీ చేయనున్నారు.

## శిశువులకు తల్లిపాలు పట్టించాలి


సీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమావేశమైన సీడీపీవో వినితాదేవి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పుట్టిన గంటలోనే పిల్లలకు తల్లిపాలు పట్టించాలని ఇబ్రహీంపట్నం సీడీపీవో వినితాదేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నంలో సీహెచ్‌సీతోపాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆరు నెలలపాటు పిల్లలకు తల్లిపాలు తప్ప ఎలాంటి ఆహారం ఇవ్వొద్దన్నారు. తల్లిపాలతోనే పిల్లల్లో ఎదుగుదల, మేధస్సు అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు తల్లిపాల కార్నర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జంగయ్యగౌడ్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు పల్లవి, అరుణ, కల్పన, విద్యుల్లత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### తుమ్మలూరులో తల్లిపాల వారోత్సవాలు


శిశువుకు ఆహారం తినిపిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ

మహేశ్వరం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి):శిశువుకు తల్లి పాలు ఎంతో ప్రాధాన్యమైనవని, పుట్టిన గంటలోనే పిల్లలకు పాలు పట్టించాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తుమ్మలూరులో గర్భిణులు, బాలింతలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లి పాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. తల్లిపాలు తాగేపిల్లలు విరోచనాలు, న్యుమోనియా తదితర వ్యాధులనుంచి రక్షణ పొందుతారన్నారు. అధిక బరువు, మధుమేహం వంటి సమస్యల నుంచి పిల్లలను కాపాడుతాయన్నారు. తల్లి పాలు పడితే పిల్లలకు మేధోశక్తి పెరుగుతందన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు రెండేళ్లు నిండే వరకు తల్లిపాలు తప్పక పట్టించాలన్నారు. ఆరు నెలల తర్వాత తల్లి పాలతో పాటు అదనపు పోషకాహారం ఇవ్వాలని బాలింతలకు సూచించారు. డబ్బా పాలు పట్టి పిల్లల ఆరోగ్యాన్ని పాడుచేయొద్దన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్‌లో వైద్య శిబిరం


బాలికకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు గోపాల్

బషీరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. నవాల్గ పీహెచ్‌సీ వైద్యుడు గోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థినులకు వైద్య చికిత్సలు చేశారు. సీజనల్ వ్యాధులు, జ్వరం, తలనొప్పి, అలర్జీ, దగ్గు, రక్తహీనత వంటి వాటితో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్యులు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం శ్రీదేవి, ల్యాబ్ టెక్నీషియన్ అభిషేక్, ఆశ వర్కర్లు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాండూరులో చెట్ల నరికివేత

- వాల్టా చట్టం ఉల్లంఘన


మునిసిపాలిటీలో నరికివేసిన చెట్లు

తాండూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చెట్ల సంరక్షణ బాధ్యత మనదేనని గొప్పలు చెప్పే మున్సిపల్ అధికారులు చట్టానికి విరుద్ధంగా చెట్లను నరికివేయించారు. శనివారం తాండూరు మున్సిపల్ కొత్త భవనం వెనుక ఉన్న స్త్రీ శక్తి భవనం, వాటర్ ట్యాంక్ వద్ద చెట్లను ప్రైవేట్ వ్యక్తులు నరికేశారు. కమిషనర్ చెప్పడంతోనే ఈ చెట్లు నరికినట్టు కార్యాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. దాదాపు 20చెట్లను నరికివేశారు. అటవీ లేదా రెవెన్యూ శాఖల అనుమతి తీసుకోకుండా నరికించేశారు. ఈ విషయంలో అధికారులను ఆరా తీయగా తమకేమి సమాచారం లేదని చెబుతున్నారు. ఈ చెట్లను కొట్టే బాధ్యతను కమిషనర్ ఓ రిటైర్డ్ ఉద్యోగికి అప్పగించినట్లు సమాచారం. లక్షన్నర విలువైన చెట్లను ఇష్టానుసారం నరికివేశారు. దీనిపై ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ డీఈ మణిపాల్‌ను వివరణ కోరగా.. చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించాలని కాంట్రాక్ట్ ఇచ్చామని, అయితే మొదళ్లను కూడా నరికి ఉంటారని ఆయన చెప్పారు. నరికిన చెట్లను మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. అనుమతి తెచ్చుకున్న తర్వాత కలప తీసుకెళ్లాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తాండూరు మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఉన్న అదనపు కలెక్టర్ దృష్టికి గానీ, అనుమతి తీసుకోకుండానే మున్సిపల్ అధికారులు సొంత నిర్ణయంతో చెట్లు నరికివేయించినట్లు తెలుస్తోంది.

## నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

నవాబుపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ వెంకటేశం హెచ్చరించారు. శనివారం నవాబుపేటలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పక ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో జ్యోతి, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటేశం

# మిత్రుల స్నేహహస్తం

- స్ఫూర్తిదాయకం.. యువకుల సంకల్పం
- స్నేహం, సహాయం, చేయూత ఫౌండేషన్ ధ్యేయం
- సామాజిక సేవల్లో ముందుకు పోతున్న ఆమనగల్లు యువకులు

**నేడు స్నేహితుల దినోత్సవం**


స్నేహహస్తం ఫౌండేషన్ సభ్యులు

ఆమనగల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో కష్టాలను ఈదిన వారు. నిరుపేద కుటుంబాల వారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వీరంతా సమాజ సేవకు సంకల్పించారు. పేద పిల్లలకు చేయూతనిచ్చేందుకు నడుంబిగించారు. సేవా సంస్థను ఏర్పాటు చేసి ఎంతో మందికి ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఈ మిత్ర బృందం సంకల్పం, కార్యదీక్ష ఆమనగల్లు ప్రాంతంలో ప్రశంసలందుకుంటోంది.

**1994-95 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సంకల్పం**

ఆమనగల్లులోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు చెందిన 1994-95బ్యాచ్ టెన్త్ విద్యార్థులు పాఠశాల విద్య పూర్తయిన తరువాత యేటా ఏటా ఏదో సమ్మేళనాన్ని నిర్వహించుకుంటూ జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు. 20ఏళ్లపాటు 107 మంది స్నేహితుల కళయిక కొనసాగింది. వారిలో చాలా మంది వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థులకు తమవంతు చేయూతనందించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థుల్లో ఒకరైన ఆమనగల్లుకు చెందిన గజ్జె చలమంద రాజు కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రాజు సంకల్పానికి తోటి మిత్రులంతా సహకరించారు.

**లక్ష్యం కోసం స్నేహహస్తం ఫౌండేషన్ ఏర్పాటు**

ఈ పూర్వ విద్యార్థులు 8 జనవరి 2017లో ఆమనగల్లులో సమావేశమయ్యారు. సేవా కార్యక్రమాలకు 'స్నేహహస్తం' పేరుతో ఫౌండేషన్‌ను స్థాపించారు. స్నేహం, సహాయం, చేయూతలే ధ్యేయంగా ఎస్‌హెచ్‌ఎఫ్ లోగోను ఆవిష్కరించారు. ప్రతీ కార్యక్రమానికి సభ్యులంతా సమావేశమయ్యేలా తీర్మానించారు. ఫౌండేషన్‌లో ప్రస్తుతం 80 మంది సభ్యులున్నారు. కార్యక్రమాల నిర్వహణకు 20 మందితో కమిటీ వేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా చలమంద రాజు, అధ్యక్షుడిగా తల్లోజు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గుంపెని శ్రీను, జహంగీర్, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.మహేశ్, పెరకేటి యాదయ్య, కోశాధికారి లింగంపల్లి ఆనంద్, రమేశ్, జగదీశ్, శ్రీను, రాంపాల్, చంద్రశేఖర్, పున్న వెంకటేశ్, జి.సూర్యప్రకాశ్, వెంకట్‌రెడ్డి, నర్సింహ, నిరంజన్, ప్రభాకర్‌రెడ్డి, సత్యం సభ్యులుగా ఉన్నారు. వీరు రెండు మూడు నెలలకోసారి సమావేశమై సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మిత్రులంతా నెలనెలా తలా కొంత ఫౌండేషన్‌కు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారు. పూర్వ విద్యార్థుల్లో పెద్దగా చదువుకోని, వివిధ వృత్తుల్లో జీవనం సాగిస్తున్న వారు సైతం వీలైనంత డబ్బును ఫౌండేషన్‌కు అందిస్తున్నారు.

**చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇవీ..**

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇప్పించి వివిధ రంగాల్లో ఉద్యోగ కల్పనకు చేయూత నిస్తున్నారు. 2022లో పోలీసు నోటిఫికేషన్‌లో ఈ ప్రాంతానికి చెందిన 70 మంది యువతకు కానిస్టేబుల్ శిక్షణ ఇప్పించగా వారిలో 10మంది ఉద్యోగాలు సాధించారు. ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించిన వారికి డీసీపీ శ్రీనివాస్ ద్వారా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

- ఆమనగల్లు మండలం చింతలపల్లికి చెందిన చుక్క రాములుగౌడ్-దంపతులు అనారోగ్యంతో చనిపోయారు. వారి పిల్లలు చందనశ్రీ, భానుశ్రీ, అభినవ్‌లకు రూ.20వేల సాయం అందజేశారు. ఏటా వంద మంది వరకు పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్నారు. ఆమనగల్లులోని బాలుర, బాలికల, బస్టాండ్ హైస్కూళ్ల విద్యార్థుల్లో వార్షిక పరీక్షల్లో టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తున్న వారికి నగదు ప్రోత్సాహకం, షీల్డ్‌లను బహూకరిస్తున్నారు. 2017లో ఆమనగల్లు శివాలయం కాలనీకి చెందిన సుధాకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స నిమిత్తం రూ.18,550 అందజేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటేలా కృషిచేస్తున్నారు. ఏటా వెయ్యి మొక్కలు నాటి సంరక్షించేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నారు. మూఢ నమ్మకాలను రూపుమాపి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నారు. రక్తదాన శిబిరాల్లో ఫౌండేషన్ సభ్యులు విరివిగా రక్తదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


అనాథ పిల్లల చదువుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు(ఫైల్)

**విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనే లక్ష్యం**



నిరుపేద కుటుంబానికి చెందని నేను చదువుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డా. ఇలాంటి పరిస్థితి మరెవ్వరికి రాకూడదని మా పూర్వ విద్యార్థులమంతా సమావేశమై స్నేహహస్తం ఫౌండేషన్ స్థాపించాం. పేద విద్యార్థులకు విద్యాపరంగా సహాయమందించి వారిని ప్రయోజకులను చేయడం ద్వారా ఆ కుటుంబం బాగుపడుతుందన్నది మా సంకల్పం. సీఐగా విధులు నిర్వహిస్తున్న నేను సేవా కార్యక్రమాలకు సహాయమందిస్తున్నా. విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనే ఫౌండేషన్ లక్ష్యం.

- గజ్జె చలమంద రాజు,వ్యవస్థాపక అధ్యక్షుడు,స్నేహహస్తం ఫౌండేషన్

**ప్రతిభ ఉన్న వారికి ప్రోత్సాహం**



చదువు, ఉద్యోగ సాధనకు పేదరికం అడ్డుకాకూడదన్నదే ఫౌండేషన్ ధ్యేయం. అందుకే ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమవుతున్న విద్యార్థుల ఉన్నత చదువుకు చేయూతనందిస్తున్నాం. ప్రతి యేటా పదో తరగతిలో ప్రతిభ కనబరుస్తున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు అందజేస్తున్నాం. స్నేహితులం తలాకొంత డబ్బు పోగుచేసుకొని ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నిరాఘాటంగా కొనసాగిస్తున్నాం. ఉద్యోగాల కల్పనకు ప్రోత్సాహాన్ని ఇచ్చాం.

- తల్లోజు చంద్రశేఖర్, అధ్యక్షుడు, స్నేహహస్తం ఫౌండేషన్

**సామాజిక ప్రయోజనం కోసం...**



సామాజిక సేవ, ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. ఏటా ఓ అడుగు ముందుకేస్తూ మా సేవలను విస్తృతం చేస్తున్నాం. ప్రజా చైతన్య కార్యక్రమాల్లోనూ మా వంతుగా పాలుపంచుకుంటున్నాం. మా జీవితాల్లో ఉన్నతికి కారణమైన పాఠశాల అభివృద్ధికి చేయూతనందించేందుకు సంకల్పించాం. ఫౌండేషన్ ద్వారా విద్య, రక్తదానం శిబిరాలు, పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం.

- పెరకేటి యాదయ్య, ప్రధాన కార్యదర్శి, స్నేహహస్తం ఫౌండేషన్

## కాంగ్రెస్‌ది జనహత పాదయాత్ర

- సీఎం రేవంత్‌రెడ్డి సీటు పోవడం ఖాయం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్
- ఏం వెలగబెట్టారని పాదయాత్ర?
- పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి

పరిగి,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్‌ది జనహిత పాదయాత్ర కాదు.. ప్రజాహత పాదయాత్ర అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ విమర్శించారు. శనివారం పరిగిలోని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వారు చేసింది హైవేపై హంగామా అని, పెళ్లి బారాత్ లెక్క ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలను సావగొడుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పాలన అట్టర్ ఫ్లాప్ అని, పాలన చేతకాకే యాత్ర చేపట్టారని హేలన చేశారు. సీఎంకు, మీనాక్షీనటరాజన్‌ల మధ్య సమన్వయం లేదన్నారు. కేసీఆర్ మిషన్ భగీరథ అయితే, కాంగ్రెస్‌ది మిషన్ మీనాక్షి అని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి 20 నెలల్లో 50 సార్లు ఢిల్లీకి వెళ్లి ఉంటారని, అక్కడ రాహుల్ కంటే, బీజేపీ వారినే ఎక్కువసార్లు కలిశాడన్నారు. రేవంత్‌రెడ్డి సీటు ఊస్టింగ్ ఖాయమన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లపై ఒక్కసారైనా మోదీతో సీఎం మాట్లాడారా? అని ప్రశ్నించారు. బీసీలు కాంగ్రెస్‌ను నమ్మడం లేదన్నా రు. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏం వెలగబెట్టారని పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. బనకచర్ల విషయంలో కాంగ్రె స్, బీజేపీ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు 80శాతం పూర్తయ్యాయని, ఐదు రిజర్వాయర్లు కట్టామని, కాలువల పనులే మిగిలాయన్నారు. వాటికి రూ.ఆరు వేల కోట్లతో పనులు చేసేందుకు టెండర్లకు కాల్‌ఫర్ చేయగా అంతలోనే ప్రభుత్వం మారిందని తెలిపారు. గ్యారంటీలు, 420 హామీల అమలు చేతకాకే స్థానిక ఎన్నికల కోసం నాటకానికి తెరలేపారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా కేసులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా చెల్లింపుల్లో విఫలయ్యారన్నారు. రుణమాఫీకి రూ.49వేల కోట్లు కావాలని వారే చెప్పి.. ఇప్పటి వరకు రూ.20వేల కోట్లే మాఫీ చేశారన్నారు. రెండు సార్లు రైతుభరోసా ఎగ్గొట్టారని తెలిపారు. సమావేశంలో పరిగి ప్యాక్స్ చైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అరవింద్‌రావు, మల్లేశం, మునిసిపల్ మాజీ చైర్మన్ అశోక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.అంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, పి.రాజు, మల్లేశం, టి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యస్థాపనే ప్రభుత్వ లక్ష్యం


ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మలిపెద్ది సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యస్థాపనే సీఎం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతాప్ సింగారంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇళ్ల లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. విడతల వారీగా అందరికీ ఇళ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో కుమార్, కీసరగుట్ట ఆలయ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌గౌడ్, అబెదాబేగం, చంద్రమౌళి, బాలరాజు, ఎన్.కుమార్ పాల్గొన్నారు.

## ఎల్‌ఐసీ ఏజెంట్లకు అండగా లియాఫి పోరాటం



అరుణకు చెక్కును ఇస్తున్న లియాఫీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థ ఏజెంట్ల హక్కుల సాధన కోసం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫి) నిరంతరం పోరాటాలు చేసి, అండగా నిలిచిందని లియాఫి డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ వద్ద ఓ హోటల్‌లో శనివారం జడ్చర్ల, షాద్‌నగర్ లియాఫి ఈసీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏజెంట్ల హక్కుల సాధనతో పాటు ఉన్న సౌకర్యాల పరిరక్షణకు పోరాటాలు చేస్తోందన్నారు. 1956లో ఎల్‌ఐసీ ఆవిర్భవిస్తే 1964లో లియాఫి ఏర్పాటైందన్నారు. ఏజెంట్లకు యాజమాన్యం నుంచి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తోందని తెలిపారు. అన్నీ తామే చేశామని ఇటీవల బీఎంఎస్ చేస్తున్న ప్రచారాన్ని ఏజెంట్లు నమ్మొద్దని కోరారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి సుదర్శనం మాట్లాడుతూ.. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ఏజెంట్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డివిజన్ కోశాధికారి జి.శ్రీనయ్య మాట్లాడుతూ.. ఏజెంట్ల కోసమే పనిచేస్తున్న సంస్థ లియాఫి అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏజెంట్ బి.యాదగిరి భార్య అరుణకు లియాఫి తరపున రూ.25వేల చెక్కు ఇచ్చారు. కార్యక్రమంలో లియాఫి షాద్‌నగర్ అధ్యక్షుడు కాట్న రాంచంద్రయ్య, జడ్చర్ల అధ్యక్షుడు శోభన్‌బాబు, యాదవచారి, శ్రీహరిగౌడ్, ఎల్.మోహన్‌రెడ్డి, సి.వెంకటయ్య, చంద్రశేఖర్‌గౌడ్, రాజుగౌడ్, సాయిరెడ్డి, మజార్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మోమిన్‌పేట్‌లో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్, ఉపాధి హామీ, మహిళా సమాఖ్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రణీత్, శంకరయ్య, మధుకర్, రాజు, వికాస్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌గౌడ్, మానెయ్య, ఎజాజ్ పాషా సోమారపు రవి తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


రోగులతో మాట్లాడుతున్న మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్

చేవెళ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎ.నరేంద్రకుమార్ తెలిపారు. శనివారం చేవెళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆయన కలియ తిరిగి విభాగాలను పరిశీలించారు. ఆసుత్రిలో చేరిన రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. రోగులకు కావాల్సిన మందులన్నీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసు పత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సమయానుకులంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు. విధుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలని సూచించారు. తనిఖీలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# జుంటుపల్లి ప్రాజెక్టుకు మహర్దశ!

● ఆధునికీకరణకు రూ.5.71కోట్ల నిధులు
● కెనాల్స్, తూముల మరమ్మతులు

తాండూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జుంటుపల్లి ప్రాజెక్టుకు మహర్దశ పట్టనుంది. ఈ ప్రాజెక్టుకు నిధులను మంజూరు చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీచేశారు. మిషన్ కాకతీయ కింద జుంటుపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.5కోట్లా 71లక్షలను మంజూరు చేశారు. ఆర్ఎఫ్ కెనాల్, ఎల్ఎఫ్ కెనాళ్ల అభివృద్ధి చేపట్టనున్నారు. చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షణలో ఈపనులు కొనసాగుతాయి. జీవో ఎంఎస్ నంబర్ 12ను అనుసరించి పనులు చేపట్టాలని జీవోలో పేర్కొన్నారు. యాలాల మండలం జుంటుపల్లి గ్రామం సమీపంలో ఉన్న ఈప్రాజెక్టు దశాబ్ద కాలంగా కాల్వలు మరమ్మతులకు నోచుకోలేదు. మండలంలోని జుంటుపల్లి, పగిడిపల్లి, అక్కంపల్లి, చెన్నారం, దౌలాపూర్ గ్రామాలకు చెందిన రైతుల భూములు ఈప్రాజెక్టు కింద ఉన్నాయి. 2080 ఎకరాల సామర్థ్యం గల ఈప్రాజెక్టు కింద ప్రస్తుతం దాదాపు 1,600ఎకరాల వరకు పారుతోంది. దాదాపు 500ఎకరాల వరకు సాగునీరు ఈప్రాజెక్టు కింద అందడం లేదు. దీంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా గతంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌ను రప్పించి ఇక్కడ ప్రాజెక్టు పరిస్థితిని స్వయంగా చూపించారు. రైతులకు సాగునీరు సక్రమంగా అందడం లేదని చివరి ఆయకట్టు భూములకు నీరందక బీడు భూములుగా మారుతున్నాయని ఎమ్మెల్యే అప్పట్లో ఇరిగేషన్ అధికారులకు సూచించారు. దీంతో చీఫ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు తాండూరు సబ్‌డివిజన్ ఇరిగేషన్ అధికారులు రూ.10కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించగా రూ.5కోట్ల 71లక్షలతో కిలోమీటర్ మేరకు కాల్వల ఆధునికీకరణ చేపట్టనున్నారు. 22ఫీట్ల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 19ఫీట్ల నీరు ఉంది.


జుంటుపల్లి ప్రాజెక్టు

## బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే రక్ష


కులకచర్ల: చెల్లాపూర్ అంగన్‌వాడీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ

కులకచర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. మండలంలోని చెల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే ఆహారంగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, ప్రమీల, సునీత, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

**పూడూరు:** పెద్దఉమ్మెంతల్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి స్వప్న, మెడికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొని బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

**బషీరాబాద్:** శిశువుకు తల్లి పాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. పర్వత్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం టీచర్ బాలమణి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించి బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

**కోట్‌పల్లి:** పుట్టిన ప్రతీ బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను సందర్భంగా శనివారం మండల పరిధిలోని బుగ్గపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాంలో సీహెచ్‌వో ఖయ్యుం, ఏఎన్ఎం హేమలత, అంగన్ వాడీ టీచర్ పారిజాత, ఆశావర్కర్ సుమిత్ర పాల్గొన్నారు.

## విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

● పెచ్చులూడిన పాఠశాల పైకప్పు
● వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో ఘటన


ఆత్కూర్ పాఠశాల వరండాలో పెచ్చులూడి పడిన పైకప్పు

పెద్దేముల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్కూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. పాఠశాల భవనం వరండాలో పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అప్పుడు విద్యార్థులు తరగతి గదుల్లో ఉండడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. 48 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాల భవనంలో 4 గదులున్నాయి. వాటిలో ఒకటి విద్యార్థులకు తాగునీటి అవసరాలు తీర్చే నీళ్ల ట్యాంకు కోసం, మరొకటి కిచెన్‌కు వినియోగిస్తున్నారు. మిగతా 2 గదుల్లోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. శుక్రవారం పాఠశాల వరండా పైకప్పు పెచ్చులూడిన వెంటనే ఉపాధ్యాయులు ఎంఈవో నర్సింగ్‌రావుకు సమాచారం ఇచ్చారు. ఈ సంగతి తెలుసుకున్న సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్.. ఎంఈఓవో కలిసి శనివారం పాఠశాలను సందర్శించి, పెచ్చులూడిన ప్రాంతాన్ని పరిశీలించారు. తరగతి గదులు, పై కప్పు శిథిలావస్థలో ఉంటే వాటిని వాడొద్దని సూచించారు. ముందుగానే ప్రమాదాన్ని ఎందుకు గుర్తించలేదని ఉపాధ్యాయులను నిలదీశారు.

పాఠశాలలో ఆర్ఎస్ఎస్ చిత్రపటాలను

## పెట్టిన టీచర్లపై చర్యలు తీసుకోవాలి

యాలాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఆర్ఎస్ఎస్ చిత్రపటాలను పెట్టిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్, దళిత ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ఎస్ఎస్ రూపొందించిన భరతమాత చిత్రపటాలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే వీటిని తొలగించాలని లేదంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఈవోకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడు సాజిత్, రాములు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక పథకాలు


దాకూరి రాచిరెడ్డి

కోట్‌పల్లి ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు దాకూరి రాచిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం సంవత్సరాల నుంచి రేషన్ కార్డులు ఇవ్వలేదని అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్‌కార్డులు ప్రభుత్వం అందజేస్తోందని గుర్తుచేశారు. భూసమస్యల పెండింగ్ కోసం భూభారతి ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యలు తహసిల్దార్ కార్యాలయంలోనే పరిష్కారమవుతున్నాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్‌పిటీసీలు గెలవడం ఖాయమన్నారు.

## జంతర్ మంతర్ వద్ద ధర్నాకు తరలిరావాలి

కులకచర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో జరిగే 42 శాతం బీసీ రిజర్వేషన్‌ల కోసం జంతర్ మంతర్‌లో జరిగే ధర్నాకు బీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు పిలుపునిచ్చారు. ఆయన శనివారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో మాట్లాడారు. సామాజిక బాధ్యతగా బీసీలకు రావాల్సిన 42 శాతం రిజర్వేషన్‌ల సాధన ధర్నా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

## అభివృద్ధి మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తా


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తాను మాటలు చెప్పడం మాత్రమే కాదని, పక్కాగా అభివృద్ధి చేసి చూపిస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన హైదరాబాద్ రోడ్డు మార్గంలోని హిందూ ఉత్సవ కేంద్ర సమితి భవన నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం మాట్లాడారు. ఈ భవన నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తానన్నారు. గుడులతో పాటు బడులు కూడ బాగు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షురాలు స్వప్న పరిమళ్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు, రవీందర్ గౌడ్, రాజు గౌడ్, విజయలక్ష్మి ఉన్నారు.

### పేదలకు సీఎంఆర్ఎఫ్‌తో భరోసా

పేదలకు సీఎం సహాయనిధితో భరోసా కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం తాండూరు పట్టణంతో పాటు పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు మండలలకు చెందిన 170మంది మంజూరైన రూ.56లక్షల 60వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్, అంజయ్య, నారాయణరెడ్డి, మధులత శ్రీనివాస్ చారీ, సురేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వడ్డె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విధులకు అంగన్‌వాడీ టీచర్ డుమ్మా


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

దోమ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ ఇష్టానుసారంగా వస్తుందని గ్రామస్తులు ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం పలువురు గ్రామస్తులు సందర్శించగా కేంద్రం తెరిచి ఉన్నా టీచర్ లేదన్నారు. ఈ విషయమై గ్రామస్తులు కాంగ్రెస్ మండల నాయకుడు పట్లోళ్ల రాంచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎలాంటి సమాచారం ఇవ్వలేదని అధికారులు తెలిపారు. విధులకు గైర్హాజరవుతున్న టీచర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## విద్యార్థుల హాజరుపై కఠినంగా ఉండొద్దు

● గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అనారోగ్య కారణాలను, అందుకు సంబంధించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని హాజరుశాతంపై నిర్ణయం తీసుకోవాలని ఇంజనీరింగ్ కాలేజీని హైకోర్టు ఆదేశించింది. తీవ్ర అనారోగ్యం వల్ల విద్యార్థుల హాజరు శాతం తగ్గితే కఠినంగా వ్యవహరించరాదని పేర్కొంది. తాను ఇంజనీరింగ్ మూడో సంవత్సరం (2024-25) సెకండ్ సెమిస్టర్ పరీక్షలు రాయకుండా కాలేజీ సర్క్యులర్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసరలోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)కి చెందిన బీటెక్ (సీఎస్‌ఈ) విద్యార్థిని కొండపర్తి మాన్విత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టీ.శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్ష రుసుము వసూలు చేసిన కాలేజీ, ఆమె అనారోగ్య కారణాలను, వైద్య సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకుండా 65శాతం హాజరులేదని 49శాతమే ఉందంటూ పరీక్షలకు అనుమతించడం లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆమెకు వ్యతిరేకంగా కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌ను కొట్టివేసింది. పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కాలేజీకి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

## సీఐకి సత్కారం



కీసర/ కీసర రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి)కీసర పోలీస్ స్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులుకు శనివారం నాగారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడూరు ఆంజనేయులుగౌడ్, ఆయనతో పాటు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగారం స్థానిక నాయకులు కిలారి శ్రీనివాస్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కీసరగుట్ట ట్రస్ట్ బోర్డుసభ్యులు సీఐని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం


బీఆర్ఎస్ ఒగులాపూర్ నూతన గ్రామ కమిటీ

కోట్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని కోట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, మండల్ వైస్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, అన్నారు. తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఒగులపూర్ గ్రామంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ గ్రామకమిటీలు వేశారు. ఒగులపూర్ గ్రామ అధ్యక్షుడుగా జి శశిధర్, వైస్ ప్రెసిడెంట్ జి పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజయ్య, యూత్ అధ్యక్షుడు బి పాండు, ఎస్సీ సెల్ మల్లేశం, బీసీ సెల్ ప్రభాకర్, జనరల్ సెక్రటరీ అమ్రేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా 2కే25 గ్రాండ్ ఇన్వెస్టిచర్ వేడుకలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తాండూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు కృష్ణవేణి కాన్సెప్ట్ హైస్కూల్‌లో అట్టహాసంగా 2కే25 గ్రాండ్ ఇన్వెస్టిచర్ వేడుకలు నిర్వహించారు. హెడ్ బాయ్, హెడ్‌గర్ల్, అసిస్టెంట్ హెడ్‌బాయ్, అసిస్టెంట్ హెడ్‌గర్ల్, డిసిప్లిన్ సెక్రటరీలు, కల్చరల్ సెక్రటరీలు, లిటరేచర్ సెక్రటరీలు, స్పోర్ట్స్ కెప్టెన్లు, రెడ్, ఎల్లో, బ్లూ, గ్రీన్‌హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లను ఎన్నుకున్నారు. రంగురంగుల దుస్తులతో చేపట్టిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, డైరెక్టర్లు సతీష్, వెంకటేశం, మల్లేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అవరోధాలను దాటుకొని ముందుకు సాగాలి


గ్రాడ్యుయేషన్ డేలో కిషన్ కుమార్, మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అవరోధాలను దాటుకొని ముందుకు సాగితేనే విజయాలు సాధించగలమని జేఎన్టీయూహెచ్ వైస్‌చాన్సలర్ డాక్టర్ కిషన్‌కుమార్ యువ ఇంజనీర్లకు సూచించారు. పోచారం మున్సిపాలిటీ, కాచవానిసింగారం, దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు చాలెంజ్‌లను అధిగమించే టెక్నికల్ స్కిల్స్‌ను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి నల్ల మల్లారెడ్డి గ్రాడ్యువేషన్ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సంధ్యావళీ కేతిరెడ్డి, కార్యదర్శి దివ్య నల్ల, ట్రెజరర్ స్నేహ నల్ల, ప్రిన్సిపాల్ ఎంఎన్‌వీ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### పెండింగ్ నిధులు విడుదల చేయాలి

యాలాల: జిల్లాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కల పెంపకానికి పాఠశాలలో ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్‌ను విడుదల చేయాలని పీఆర్టీయూటీఎస్ యాలాల మండల సభ్యులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యేను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ ప్రతినిధులు సీ.కృష్ణారెడ్డి, సీహెచ్.రాములు, ఇ.శ్రీధర్‌రెడ్డి, మొగులప్ప, ఎల్.నర్సిరెడ్డి, ఎల్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

### నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కీసర: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎమ్ వరలక్ష్మి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం విద్యార్థి నాయకుల ప్రమాణాస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె విచ్చేశారు.

### వ్యవసాయ విధానంపై అవగాహన

కొడంగల్/కొడంగల్ రూరల్: వ్యవసాయ విధానంపై స్థానిక ఇండస్ వ్యాలీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని పంట పొలాలకు శనివారం తీసుకెళ్లి పంటల సాగు, వ్యవసాయం, పనిముట్లు, ఆధునిక వ్యవసాయంలో వచ్చిన మార్పులు తదితర వాటిపై రైతులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### భూసార పరీక్షలను విధిగా చేయించాలి

కొడంగల్/కొడంగల్ రూరల్: పంటలు సాగుచేసే ప్రతి రైతు మేలైన దిగుబడిని సాధించాలంటే భూసార పరీక్షలను(మట్టి) విధిగా చేయించాలని మండల వ్యవసాయ అధికారి జి. తులసి అన్నారు. పర్సాపూర్‌లో శనివారం రైతుల పొలాల్లో మట్టి నమూనాల సేకరించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 550సాయిల్ హైల్త్‌కార్డులు కేటాయించినట్లు తెలిపారు. అందులో 425 కార్డులు కొడంగల్ క్లస్టర్, 125 కార్డులు పర్సాపూర్ క్లస్టర్‌కు మట్టి నమూనాలను సేకరించి రాజేంద్రనగర్‌లో ఉన్న భూసార పరీక్ష కేంద్రానికి పంపించనున్నట్లు తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

దోమ: గుండాల గ్రామంలో నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రూ.10వేలు శనివారం విరాళాన్ని అందజేశారు.

### పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బొంరాస్‌పేట్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. తుంకిమెట్ల, మెట్లకుంట, చౌదర్‌పల్లి, నాందర్‌పూర్ గ్రామాల్లో శనివారం లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్స్‌ను కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

### పేద విద్యార్థులను ఆదుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే పేదవిద్యార్థులను ఆదుకోవడానికి ప్రతీఒక్కరు ముందుకురావాలని బీజేపీ నాయకుడు ఏనుగు మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. అవుశాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన శనివారం బ్యాగులు పంపిణీ చేశారు.

### దోమల మందు పిచికారి

తాండూరు: గాంధీనగర్ ప్రాంతంలో శనివారం మాజీ కౌన్సిలర్ సంగీత ఠాకూర్‌గల్లిలో సొంత డబ్బులతో దోమల మందు పిచికారి చేయించారు. మున్సిపాలిటీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు.

### విద్యార్థులకు చదవడం, రాయడం రావాలి

కులకచర్ల: ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. పీరంపల్లి గ్రామప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి విద్యార్థులతో పాఠాలు చదివించారు.

### సైబర్ నేరాలపై అవగాహన

కులకచర్ల: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు సిబ్బంది తెలిపారు. స్థానిక కేజీబీవీలో శనివారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. డయల్ 1098, 100 పై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### బ్యాంకు లావాదేవీలపై అవగాహన ఉండాలి

కులకచర్ల: బ్యాంకు లావాదేవీలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్బీఐ మేనేజర్ గోపాల్‌సింగ్ అన్నారు. కులకచర్లలో ఖాతాదారులకు శనివారం బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఖాతాదారుడు బీమాపాలసీ చేయాలన్నారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

● బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
● సుల్తాన్‌పూర్ గేట్ సమీపంలో ఘటన

పరిగి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను, డీసీఎం ఢీకొనడంతో దంపతులు మృతిచెందారు. ఈ ప్రమాదం శనివారం సుల్తాన్‌పూర్ గేట్ సమీపంలో జరిగింది. బొంరాస్‌పేట్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన కొనగంటి వెంకటయ్య(38) భార్య లక్ష్మి(36)తో కలిసి పరిగికి వచ్చాడు. బైక్‌పై తిరుగు ప్రయాణంలో పరిగి మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. భర్త వెంకటయ్యకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాలను ఆస్పత్రి మార్చురీకి తరలించారు. డీసీఎంను స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు పరిగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

కీసర రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. కీసరకు చెందిన నవీన్ బైక్‌పై శామీర్‌పేట వెళ్తుండగా గోశాల వద్ద బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో నవీన్ తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని 108అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో, కారు ఢీకొని మరొకరికి..

**పూడూరు:** ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి గాయాలయ్యాయి. ఈ ఘటన పూడూరు మండలంలో జరిగింది. చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కులకచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామానికి చెందిన బ్రహ్మం ఆటోలో నలుగురు ప్రయాణికులతో మన్నెగూడ మీదుగా హైదరాబాద్ వెళుతున్నాడు. కండ్లపల్లి గేటు వద్దకు రాగానే ఆటో, కారుఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బంటు మహేశ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితుడిని చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 260 గ్రాముల గంజాయి పట్టివేత

● ఇద్దరిపై కేసు నమోదు


గంజాయితో పట్టుబడిన నిందితులతో సీఐ శ్రీనివాస్, సిబ్బంది

పరిగి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు డీటీఎఫ్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈఎస్ విజయ్‌భాస్కర్, ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు శనివారం తనిఖీలు నిర్వహించారు. బైక్‌పై గంజాయిని తీసుకెళుతున్న ఇద్దరిని పట్టుకుని వారి నుంచి 260గ్రాముల ఎండు గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో పరిగికి చెందిన నీరజ్‌కుమార్, షాద్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన విపిన్‌కాంకర్‌లపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఇద్దరి వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ప్రేమ్‌కుమార్, సిబ్బంది హన్మంత్ ఉన్నారు.

### అక్రమ వెంచర్ తొలగింపు

మూడుచింతలపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి లక్ష్మాపూర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌ను మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం అధికారులు తొలగించారు. లక్ష్మాపూర్‌లోని సర్వే నంబరు 367లో గల రెండెకరాల 27గుంటల్లో గత కొద్ది రోజుల కిందట అక్రమ వెంచర్ ఏర్పాటుచేసి విక్రయాలు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారన్న విషయం అధికారుల దృష్టికి రావడంతో డోజర్ సాయంతో కడీలను తొలగించి వెంచర్‌ను కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో ఏటీపీవో దేవేందర్, కారోబార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### బైండోవర్ నిబంధన ఉల్లంఘించిన వ్యక్తికి జైలు

తాండూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బైండోవర్ అయిన కొద్ది రోజులకే సారా రవాణా చేస్తూ నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తికి జైలు శిక్ష విధించారు. తాండూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ ఆదిశేషిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిగడ్డ తండాకు చెందిన రాథోడ్ రవీందర్ సారా రవాణా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడగా గతంలో పెద్దేముల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయితే కొన్ని రోజులకే తిరిగి సారా రవాణా చేస్తూ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీంకి పట్టుబడ్డాడు. అప్పట్లో తాండూరు ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు తర్వాత బైండోవర్ చేయగా సత్ప్రవర్తన కలిగి ఉంటానని చెప్పి అట్టి నిబంధనలను ఉల్లఘించాడు. దీంతో పెద్దేముల్ తహసీల్దార్ వెంకట ప్రసాద్ ఎదురుగా హాజరు పర్చగా అతడికి రూ.50వేలు జరిమానా విధించి శనివారం నిందితుడికి జైలుకు పంపించారు. జరిమానా రుసుము చెల్లించని పక్షంలో మూడేళ్ల జైలు తప్పదని సీఐ హెచ్చరించారు.

### ఆలయంలో చోరీ

కీసర రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ పరిధి బోగారంలోని శివాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి లోనికివెళ్లగా స్వామివారికి సంబంధించిన వస్తువులు అదృశ్యమయ్యాయి. ఆలయంలో చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఆలయంలో పరిశీలించగా నాగపడిగె తొడుగు, శివపార్వతుల విగ్రహాలు, ఆభరణాలు, ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ మొత్తం రూ.లక్ష ఉన్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన డబ్బులు, వస్తువులు

దౌల్తాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన సంఘటన దౌల్తాబాద్ మండలంలో జరిగింది. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అనంతప్ప శనివారం ఇంట్లోని దేవుడి చిత్రపటాల దగ్గర దీపం పెట్టి తాళంవేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అనంతప్పకు సమాచారం అందించారు. దేవుడి చిత్రపటాల దగ్గర పెట్టిన దీపం కారణంగానే ఇల్లు దగ్ధమైందని గమనించారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న విలువైన పత్రాలు, బంగారు నగలు, రూ.50వేలు కాలి బూడిదయ్యాయని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వంగా బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గాయత్రి ఆదేశాలతో ఆర్ఐ సునీల్‌కుమార్, ఎస్ఐ బంగారు రాజు ఘటనాస్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.